క్లుప్తంగా

మెడికల్ క్యాంపు ఏర్పాటు



మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారిపై వెళ్లే శివ స్వాములకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రోడ్డ పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ నాగిరెడ్డి

కల్లూరు: సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ డీఈ నాగిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కె.మార్కాపురం గ్రామంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పీఆర్ ఏఈ రవి మోహన్‌రెడ్డి ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



పోస్టాఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

పాణ్యం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోస్టాఫీసు ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖను ప్రైవేట్ పరం చేయాలని యత్నిస్తోందని.. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. టార్గెట్ల పేరుతో సిబ్బందిని వేధించడం తగదన్నారు. పోస్టాఫీసు చట్టం 2023ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ పోస్టాఫీసు అధికారి సుధీర్, శేఖర్, మహిత, ఫయాజ్‌బాషా, షాహింషా, ప్రియాంక, గంగా, సత్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో డోన్ ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికి స్వామివారికి విశేష పూజలు, అర్చనలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సి.బెళగల్: ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తామని.. ఇందు కోసం రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు సంఖ్య ఇచ్చినట్లు, ప్రతి రైతుకు యూనిక్ కోడ్‌ని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు వ్యవసాయంలో చేట్టాల్సిన సంరక్షణ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనోత్పత్తి పద్ధతులు, సబ్సిడీ పథకాలను తెలియజేశారు.

21న జాబ్‌మేళా

ఆదోని రూరల్: ఆదోనిలోని నాక్ శిక్షణా కేంద్రం ఎంపీయూపీ స్కూల్‌లో ఈనెల 21వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. జాబ్ మేళాలో హ్యుండాయ్ మోబిస్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎల్ఎల్‌పీ, కేఐఎంఎల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం అందుతుందన్నారు. వివరాలకు 91774 13642 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విశిష్ట సంఖ్యతో ఎన్నో లాభాలు

- వ్యవసాయానికి ఎంతో కీలకం
- సొంతభూమి ఉన్నవారే అర్హులు
- ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం
- రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభమైన నమోదు ప్రక్రియ



కొరటమద్ది రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గడివేముల: ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

సాగు వివరాలు

మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో వివిధ పంటలు సాగు చేశారు. ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి, శనగ, పెసర, మినుము, పొగాకు, మొక్కజొన్న, చిక్కుడు, మామిడి, జామ, సపోట, మునక్కాయ తదితర పంటలు సాగవుతున్నాయి. మండలంలో 32 వేల ఎకరాల పొలం ఉండగా దాదాపు 10 వేల మంది రైతులు ఉన్నారు. వీరంతా విశిష్ట సంఖ్య కోసం నమోదు చేయించుకోవాల్సి ఉంది. సొంత పొలం ఉన్న రైతులంతరూ అధికారులు సూచించిన ధ్రువపత్రాలతో స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేసుకుంటారు.

అవసరమైన పత్రాలు:

విశిష్ట సంఖ్య నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, లేదా వన్‌బీ, ఆధార్ లింకైన మొబైల్ నంబర్ అవసరం. వీటిని తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళితే వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతు ఆధార్ లింక్ మొబైల్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు వస్తాయి. వాటిని ఎంటర్ చేసి, రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి.

ప్రయోజనాలివే..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, బిందు సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే పంట నష్టపరిహారం సత్వరం పొందేందుకు ఉపయోగపడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందడానికి తోడ్పడుతుంది.

ఎన్నో ప్రయోజనాలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేయించుకుని, విశిష్ట సంఖ్య పొందాలి. ప్రభుత్వ పథకాలను ఈ ఐడీ ద్వారా రైతులు పొందే అవకాశం ఉంటుంది. మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఈ నెల 28వ తేదీ లోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

–హేమసుందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, గడివేముల

ఆందోళనగా ఉంది



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్య మెలిక పెట్టడంతో ఆందోళనంగా ఉంది. గతంలో సొంత భూమి ఉన్న వారితో పాటు కౌలు రైతులకు కూడా పథకాలు అందేవి. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి పథకాలు ఆగిపోయాయి. ఇప్పటికైనా రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు మంజూరు చేయాలి. ఖరీఫ్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ రైతులకు ఎలాంటి పథకాలు అందలేదు.

–రమేష్, రైతు, దుర్వేశి గ్రామం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లోని రైతులకు విశిష్ట సంఖ్య నమోదు, కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి నమోదు చేసుకుంటున్నారు. ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే విశిష్ట సంఖ్య ఎంతో అవసరం. పొలం ఉన్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోండి.

–చంద్రకంటి రమేష్, వీఏఏ, గడిగరేవుల



నందనపల్లెలో ఉపాధి కూలీలతో ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి

సచివాలయం తనిఖీ

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం సచివాలయాన్ని ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో సర్వేలు ఎలా సాగుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నందనపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం చెక్‌డ్యాం పూడిక తీత పనులను తనిఖీ చేశారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్, ఏపీఓ మధుబాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ ముక్తార్ బాషా తదితరులు ఉన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు వివరాలు నమోదు చేసుకుని విశిష్ట సంఖ్య పొందాలని వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతుల వివరాలు, సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 2,675 మంది రైతులు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. నమోదు చేసుకోని రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏఈఓ భాస్కర్, వీహెచ్ఏలు వెంకటేశ్వర్లు, రవికుమార్ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రమేష్‌కుమార్

పాణ్యం: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని నంద్యాల జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలకు అన్ని విధాలుగా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్లను కేటాయించిందని తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా టోల్‌ఫ్రీ నంబర్ 112కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారని చెప్పారు. ఏ సమస్యల వచ్చినా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధిపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ మేరకు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యులు పి.దానం, శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు విడుదల

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద ఆయకట్టుకు విడుదల చేసిన సాగునీటిని రైతులు వృథా చేయకుండా పంటల సాగుకు వినియోగించుకోవాలని ఏఈ నారాయణ మంగళవారం తెలిపారు. ఎడమ కాల్వ కింద 3,500కు పైగా ఎకరాల్లో రైతులు ఆరుతడి పంటలను సాగు చేశారన్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీటి తడులు కట్టేందుకు నాలుగు రోజుల నుంచి ఎడమ కాల్వకు 40క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు ఆర్.నాగేంద్రరెడ్డి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ఛైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం అల్వార్‌లోని సన్‌రైజ్ విశ్వ విద్యాలయంలో గణితశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనీష్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు పేర్కొన్నారు. నాగేంద్రరెడ్డిని ఛైర్మన్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కన్నా కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయపడ్డ ఉరుకుందు, ఖాదర్ బాషా

కోడుమూరు రూరల్: శివరాత్రి సందర్భంగా శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు వెళుతున్న ఓ పాదయాత్రికుడిని ద్విచక్రవాహనం ఢీకొంది. మంగళవారం రాత్రి కోడుమూరు–కర్నూలు రహదారిపై పెంచికలపాడు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన ఉరుకుందు తోటి గ్రామస్తులతో కలిసి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరాడు. అయితే మార్గమధ్యలో పెంచికలపాడు గ్రామం వద్ద బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉరుకుందుతో పాటు, ద్విచక్రవాహనంపై వస్తున్న కటికె ఖాదర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కె.నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ




ఓర్వకల్లు: మాట్లాడుతున్న ఎంఈఓ–2 , పాణ్యం: అంగన్‌వాడీలకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ కోటయ్య

ఓర్వకల్లు: అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికే అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యాకర్తలకు శిక్షణ తరగతును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. పలు అంశాలపై ఈ నెల 25వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ప్రతి అంగన్‌వాడీ వర్కర్ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 శ్రీధర్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా హెప్సిల్లా, రీసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

- పాణ్యం: బాల్య సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా 120 రోజుల కోర్సుపై 6 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ కోటయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ దశ నుంచి పిల్లలకు సక్రమంగా విద్యను అందించేలా సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన, పౌష్టికాహారం, పాఠశాల వాతావరణాన్ని వారికి ఎలా అలవాటు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. మొదటి దశ 18 నుంచి 20వ తేదీ వరకు.. రెండో దశలో 22 నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళావతమ్మ , అడిషనల్ సీడీపీఓ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ పాల్గొన్నారు.



ఎ.బెళగల్‌లో..

- సి.బెళగల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతిపై మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈఓ జ్యోతి మాట్లాడుతూ.. మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతిపై ఆరు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన, ప్రీస్కూల్ నిర్వహణపై రిసోర్స్ పర్సన్స్ హెచ్ఎం మునిస్వామి, ఉపాధ్యాయుడు ఖడ్గం రాజు అవాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ రాముడు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ.. ఆయా సచివాలయ వారీగా పెండింగ్‌లో ఉన్న సర్వేలన్నింటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఈబీసీ, బీసీ కార్పొరేషన్ కింద 68 యూనిట్లను మంజూరు చేసిందని, ఈ యూనిట్ల కోసం మండలంలో మొత్తం 1261 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ఈ అప్లికేషన్లను పరిశీలించి స్క్రూటీనీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల భాగస్వామ్యంతో మోడల్ విలేజీగా తీర్చిదిద్దాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ సూచించారు.

శ్రీశైలానికి పాదయాత్ర



బైన్‌దొడ్డి నుంచి శ్రీశైలానికి వెళుతున్న శివస్వాములు

కోడుమూరు రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు మండలంలోని బైన్‌దొడ్డి గ్రామం నుంచి 20మందికి పైగా శివస్వాములు మంగళవారం కాలినడకన తరలివెళ్లారు. ఈ సందర్భంగా శివస్వాములు గ్రామంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు వారిని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పొలిమేరలో సాగనంపారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు : శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి కాలినడకన కోడు మూరు మీదుగా తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం పట్టణంలో పల్రప్ప జిన్నులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మదన్‌శేఖర్ తెలిపారు. భక్తులకు అవసరమైన మందులు అందజేస్తామన్నారు.

సి.బెళగల్ నుంచి 75 మంది

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాల నుంచి శివమాలధారులు మంగళవారం శ్రీశైలంకు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన దాదాపు 75 మంది శివ భక్తులు స్థానిక శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీశైలంకు బయలుదేరి వెళ్లారు. అదే విధంగా గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాలకు చెందిన పలువురు శివ స్వాములు పాదయాత్రగా శ్రీశైలంకు వెళ్లారు. వీరు శివ రాత్రి రోజు శ్రీశైలం చేరుకుని ఇరుముడులు సమర్పించి శివదీక్షలను విరమిస్తారని అర్చకుడు తెలిపారు.



సి.బెళగల్ నుంచి శ్రీశైలం బయలుదేరిన శివమాలధారులు

ఎల్లమ్మకు విశేష పూజలు



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకారణలో అమ్మవారు


కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమర్చన, ఆకుపూజ చేశారు మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి గుగ్గిళ్లు, భక్షాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి

కర్నూలు కల్చరల్: బాల శివాజీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు బండి మెట్ట అంబాభవానీ దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి స్వామి వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రతిమతో శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ ర్యాలీ

వీకర్ సెక్షన్ కాలనీలోని పట్టాభి రామ, వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి ఉల్చాల రోడ్‌లోని చత్రపతి శివాజీ సర్కిల్ వరకు ఉదయం 9.30 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.




క్రిష్ణదొడ్డి వద్ద కంపచెట్ల మధ్య బస్‌షెల్టర్, గొల్లలదొడ్డిలో బస్‌షెల్టర్‌కు అడ్డంగా ఉంచిన బంక్

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు



ముడుమాలలో..

సి.బెళగల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రయాణికుల అవసరాల మేరకు నిర్మించిన బస్‌షెల్టర్లు పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. గొల్లలదొడ్డి, ముడుమాల, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాల్లోని బస్‌షెల్టర్లు ముళ్లపొదలు, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కూర్చునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా బురాన్‌దొడ్డి, మారందొడ్డి, తిమ్మందొడ్డి గ్రామాల్లో ప్రజా అవసరాలకు దూరంగా బస్‌షెల్టర్లను నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని బస్‌షెల్టర్లను ఆక్రమించుకుని వాటి ముందే కొందరు బంకలను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసి బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



బురాన్‌దొడ్డిలో..